# ఆమె నవ్వు



ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలై పోయినై. సెలవుల్లో విశాఖపట్నంలో వుంటున్న మావయ్య దగ్గరకు వెళ్లి హాయిగా షికార్లు కొట్టొచ్చని ఎదురు చూస్తున్న సెలవులు రానే వచ్చినై. రెండుజతల బట్టలు భద్రంగా చేతి సంచిలో పెట్టి, సిల్కు షర్టూ పాయిజమా వేసుకుని గంటసేపు అద్దం ముందు కూర్చుని ముస్తాబై, సంచి పట్టుకుని బస్సు స్టేండు చేరుకున్నాను.

మావయ్యకి బస్సుల్ని తనిఖీచేసే పని. అందుకని కండక్టర్ నన్ను చూడచూడ్డంతోనే సలాంచేసి ఫ్రంటు సీటు ఖాళీ చేసి నన్ను కూర్చోపెట్టేడు.

బస్సునిండా ప్రయాణీకులు క్రిక్కిరిసి కూర్చున్నారు. రణగొణధ్వనిగా వుంది. నా మట్టుక సీటులో నే నొక్కణ్ణే. విశాలంగా ముందుసీటులో హాయిగా కాలుమీద కాలు వేసుకుని దర్జాగా కూర్చున్నాను.

బస్సు విజయనగరం స్టేండు విడిచిపెట్టి మెల్లగా బయల్దేరింది. బస్సులో వాళ్ళంతా కాస్త ఊపిరి పీల్చుకున్నారు. బస్సు కస్పా మీదుగా వెళ్ళి రాజావారి కోటకో అర్ధానుస్వారం చుట్టి భీముని పట్నం మీదుగా వెళ్ళే విశాఖపట్నం రోడ్డునపడి తాపీగా సాగి పోతూంది

కమ్మని గాలి వీస్తూంది.

రోడ్డుపక్క చెట్లను వీన్నప్పుడు సందు చేసుకుని వచ్చిన ఉదయకిరణాలు ఏటవాలుగా వచ్చి మీదను పడుతున్నాయి. దూరంగా వున్న పచ్చపచ్చ చెట్లు, తాటిచెట్లు ఆకాశం అంచున గిరగిరా తిరుగుతున్నై. దృష్టి అక్కడే వుంది గాని ఆలోచనలు ఎక్కడో విశాఖపట్నం వీధులూ, సముద్రం హోరూ, కొండలు విశ్వవిద్యాలయం, ఇంగ్లీషు చిత్రాలూ, అన్నిటినీ దాటి ఆడపిల్లల వైపు మళ్ళింది.

మామూలు మీసాలనూ, గడ్డాన్ని తడుముకున్నాను. సెంటు పులిమిన చేతి రుమాలుతో ముఖం అదుముకున్నాను. చెరిగిన ముంగురులను జేబులోవున్న దువ్వెనతో దువ్వుకున్నాను.

బస్సు భీమునిపట్నం సమీపిస్తూంది. కాలేజీ అమ్మాయిలు జ్ఞాపకం వచ్చేరు. వాళ్ల వైపు నేనూ నావైపు వాళ్లు ఓరగా చూసుకున్న దృశ్యాలూ, వాళ్ళను ఇంటివరకు సాగనంపడాలూ, నావైపు వాళ్లు చూసినప్పుడు మురిసిపోవడం మొదలైన ఊహాలతో కాలం బస్సుచక్రాల ననుకరించి భీముని పట్నం స్టేండులో ఆగింది.

పి. వెంకటపతి

స్టేండు సంతటినీ గొడుగులా ఆవరించుకున్న మఱ్ఱిచెట్టు నీడ నిస్తూంది. ఎక్కే ప్రయాణీకులూ, దిగే ప్రయాణీకులతో హడావిడిగా వుంది. పేసింజర్లంతా కొబ్బరి బొండాలు కొట్టించుకుని నీళ్లు తాగుతున్నారు. ఇద్దరమ్మాయిల్ని వెంటబెట్టుకుని వచ్చి ఒక 'సిస్టర్' నేను కూర్చున్న వైపునే మా బస్సు 'బోనెట్'ని ఆనుకుని నిలుచుంది

'సిస్టర్' పాదాలవరకూ తెల్లని గౌను కుచ్చులు కుచ్చులుగా వేసుకుని నల్లని కర్రపూసలతోవున్న 'క్రాస్'ని మెళ్లో వేసుకుంది. అమ్మాయిలిద్దరు మంచి విలువైన బట్టలు కట్టుకున్నారు. ఆభరణా లేవీలేవు. క్రిస్టియన్సే అయినప్పటికీ పచ్చని శరీరచ్ఛాయతో కన్నుముక్కు తీరుగా వుండి నాజూకుగా వున్నారు. కవలపిల్లలేమో అనిపించింది.

ఒక అమ్మాయి 'సిస్టర్'తో ఏదో ఇంగ్లీషులో మాట్లాడుతోంది. రెండో అమ్మాయి నావైపు ఆత్రుతగా చూస్తోంది. నేను కూడా పరీక్షగా అన్నీ మర్చిపోయి ఆమెవైపే చూస్తున్నాను.

దృష్టంతా అమ్మాయి మీదనే. నాతో పరిచయం వున్నట్టు నావైపు చూస్తూంది. ముఖం ఎత్తుతూ దించుతూ ముసిముసి నవ్వులు నవ్వుతూంది; ఆమెను నేనెక్కడో చూసినట్టు! గుర్తుకి రావడంలేదు. నన్ను తెలీకపోతే నావైపుచూసి ఎందుకు ఆవిడ అలా బుగ్గలు సొట్టలు పడేలాగ కలికి పోతోంది! నేనుకూడా ఆమె వైపు నవ్వు ముఖంతో చూస్తున్నాను. పలకరిద్దామంటే సిగ్గు — భిడియం, చిన్నతనం. డ్రయివరు ఎప్పుడు వచ్చి పక్కను కూర్చున్నది బస్సు స్టార్టుచేసింది తెలియలేదు. బస్సు మెల్లగా కదిలిపోయింది. బస్సుహోరను విని వాళ్లు ముగ్గురూ పక్కకు తప్పుకున్నారు. కాని అమ్మాయి మాత్రం నామనస్సునుండి తప్పుకోలేదు. ఎందుకు నవ్వుతోందో ఎంత ఆలోచించినా తట్టడం లేదు. ఎంత జ్ఞాపకం తెచ్చుకుందామన్నా ఎక్కడ చూసిందీ జ్ఞాపకం రావడంలేదు.

భీమునిపట్నంలో బస్సుదిగి పోవలసింది. దిగి ఆ అమ్మాయి అంతు తేల్చుకోవలసింది. "నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా? లేక వట్టినే అల్లరికి అలా నవ్వులు చిలికిస్తున్నావా?" అని అడగాలనిపించింది. అన్నన్న, బస్సు భీమునిపట్నం దాటిపోయిందే! మనస్సు కొట్టుకుపోతూంది. ఎదురుగా ఏదేనా బస్సు కనిపిస్తే ఆపించి తిరిగి భీముని పట్నం వెళదామని తీర్మానించుకున్నాను. ఈ ఆలోచనల్లో చేయి తలమీదకు పోయింది.

ఒక్క షాక్ తగిలినట్టయింది!

నాకు జేబులో ఎప్పుడు దువ్వెన వుంచుకుని గంటా గంటకి ఎక్కడపడితే అక్కడ తల దువ్వుకోవడం అలవాటు. ఆ దువ్వుకోవడంలో ఎప్పుడో క్రాపింగు నొక్కుల్లో దువ్వెన మర్చిపోయేను. ఆకు పచ్చరంగు ప్లాస్టిక్ దువ్వెన అలాగే తలమీద కనిపిస్తోంది. అది చూసి అమ్మాయి నవ్వుతే నేనేదో అనుకున్నాను, నాటినుండి మరెన్నడు దువ్వెన జేబులో పెట్టిన పాపాన పోలేదు, అమ్మాయిలకోసం వెర్రి మొర్రి వేషాలూ వెయ్యలేదు. ★